# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 31-03-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- విశాఖను ఐటి హబ్ గా అభివృద్ధిచేసి యువతకు 5 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

- రక్తదానంపై గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా అవగాహన కల్పించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు.

- దుర్గుణాలకు ఎలా దూరంగా ఉండాలో పవిత్ర రంజాన్ మాసం బోధిస్తుందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

- నిరుపయోగ భూములను వినియోగంలోనికి తెచ్చి ఉపాధి అవకాశాలను పెంచడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు.

- తల్లిదండ్రులు తమ పిల్లల్లో నైతికతను పెంపొందించేందుకు కృషి చేయాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పిలుపునిచ్చారు.

=====================

విశాఖను ఐటి హబ్ గా అభివృద్ధి చేసి, రాబోయే 5 సంవత్సరాల్లో యువతకు 5 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఈ రోజు విశాఖపట్నంలో మంత్రి పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారతదేశం 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థలో విశాఖ ప్రాంతం కీలకపాత్ర వహించబోతోందన్నారు. రాష్ట్రంలో రాబోయే 5 ఏళ్లలో 50 వేల హోటల్ రూమ్ లు అందుబాటులో ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. విశాఖ నగరంలో అత్యాధునిక సౌకర్యాలతో ప్రపంచ స్థాయి క్రికెట్ స్టేడియం ఇప్పటికే అందుబాటులో ఉందని, భోగాపురం ఎయిర్ పోర్టు త్వరలో పూర్తి కాబోతోందని వివారిచారు. దేశంలో 5వ అతిపెద్ద ఆర్థిక నగరంగా విశాఖపట్నం అవతరించబోతోందన్నారు. విశాఖ మహానగరం భారతదేశ భవిష్యత్తును నిర్దేశించే కొత్తతరం కంపెనీలకు కేంద్ర బిందువుగా, ఆవిష్కరణల కేంద్రంగా ఉండాలని కోరుకుంటున్నామని మంత్రి లోకేష్ పేర్కొంటూ..

(వాయిస్ 30 సెకన్లు)

=====================

రక్తదానంపై గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ రోజు విజయనగరం జిల్లా కేంద్రంలో రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో ప్లేట్‌లెట్స్ కాంపోనెంట్ యూనిట్, ఎస్‌డిపి యూనిట్‌ను పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, శాసనసభ్యురాలు అదితి విజయలక్ష్మి గజపతిరాజులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... రెడ్ క్రాస్ ద్వారా మరిన్ని రక్తదాన శిబిరాలను నిర్వహించి, జిల్లాలో రక్తం కొరతను నివారించేందుకు కృషి చేయాలని కోరారు. యువత పెద్ద ఎత్తున రక్తదానానికి ముందుకు రావాలని మంత్రి పిలుపినిస్తూ..

(వాయిస్ 30 సెకన్లు)

=====================

దుర్గుణాల నుండి  మానవుడు ఎలా దూరంగా ఉండాలో పవిత్ర రంజాన్ మాసం బోధిస్తుందని కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. గుంటూరులోని ఈ రోజు ముస్లిం సోదరులతో కలిసి ఈద్గా ప్రార్ధనలకు కేంద్రమంత్రి హాజరయ్యారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసం, నియమ నిష్ఠలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని తెలిపారు.

=====================

నీటి నాణ్యత ప్రమాణాల పరీక్షలను తరచుగా చేపట్టాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈరోజు సంబంధిత అధికారులతో కలెక్టర్ శ్రవణమాధ్యమ సమావేశం నిర్వహించారు. ఆరోగ్య, గ్రామీణ నీటి సరఫరా విభాగాల పరిధిలో చేపడుతున్న నీటి నాణ్యత పరీక్షలు పక్కాగా ఉండాలని, నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఉపాధి హామీ పనుల ప్రదేశాల్లో నీడ ఏర్పాటు చేయాలని, ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో ఉపాధి హామీ పనులు చేపట్టకుండా సమయాల్లో మార్పులు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

విరామం

=====================

రాష్ట్రంలోని నిరుపయోగంగా ఉన్న భూములను వినియోగంలోనికి తెచ్చి  ఉపాధి అవకాశాలను పెంపొందించడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ప్రకాశం జిల్లా పి.సి.పల్లి మండలం దివాకరపురం గ్రామంలో రిలయన్స్ సంస్ధ ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ కంప్రెస్డ్ బయోగ్యాస్ (సిబీజీ) ప్లాంట్ శంకుస్థాపన ఏర్పాట్లను ఆయన ఈ రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏప్రిల్ 2న రాష్ట్రంలో తొలి సీబీజీ ప్లాంట్ కి మంత్రి లోకేష్, రిలయన్స్ ప్రతినిధులు శంకుస్థాపన చేస్తారని చెప్పారు. రానున్న 5 సంవత్సరాల్లో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రాష్ట్రంలో రిలయన్స్ సంస్ధ 500 ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నదని మంత్రి తెలియజేస్తూ..

(వాయిస్ 30 సెకన్లు)

=====================

కర్నూలు జిల్లా కర్నూలు నగరంలో రంజాన్ పండుగ పురస్కరించుకొని పాత ఈద్గాలో ముస్లిం సోదరులు ఈ రోజు నిర్వహించిన ప్రార్ధనల్లో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పాల్గొన్నారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి భరత్ మాట్లాడుతూ... వర్షాలు బాగా కురావాలని, ప్రజలు సంతోషంగా ఉండాలని ప్రార్ధించినట్లు తెలిపారు. కర్నూలులో అన్ని పండుగలను కుల, మతాలకు అతీతంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నదని తెలియజేస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

=====================

తల్లిదండ్రులు తమ పిల్లల్లో నైతికతను పెంపొందించేందుకు కృషి చేయాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పిలుపునిచ్చారు. ఈరోజు పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలంలో సుమారు కోటి 25 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన రహదారిని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... పిల్లల్లో ముఖ్యంగా మగపిల్లల్లో కనీస నైతికతను పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సాలూరు మండలంలో 3 రహదారులకు మరో 30 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని తెలిపారు. రహదారి సౌకర్యం లేని అన్ని గ్రామాలకు రహదారులు వేస్తామని హామీ ఇచ్చారు. డోలి సమస్యలు తలెత్తకుండా గిరిజన గ్రామాలన్నింటికీ రహదారులు ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారని మంత్రి వివరించారు.

=====================

నాఫెడ్, మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో మినుములు కొనుగోలు చేయడం జరుగుతుందని పార్వతీపురం మన్యం జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్.ఎస్ శోబిక ఈరోజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా రబీ సీజన్ లో సాగు చేసిన అపరాల కొనుగోలుకు సంబంధించి పేరు నమోదు ప్రక్రియ ప్రారంభించామని ఆమె తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నాఫెడ్, మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో మినుములు కొనుగోలు చేస్తామని, క్వింటాల్ మినుములకు 7 వేల 400 రూపాయల మద్దతు ధర నిర్ణయించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ-క్రాప్, ఈ-కెవైసీ చేయించుకున్న రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాలలో సీ.ఎం.ఎ.పి.పి.లో పేర్లను నమోదు చేయించుకోవాలని ఆమె కోరారు.

=====================

అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డివిజన్, గొందూరు గ్రామంలో ప్రసిద్ది చెందిన మాతృశ్రీ గండి పోచమ్మ అమ్మవారి జాతరమహోత్సవాలు ఈ రోజు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేకువ జామున అమ్మవారికి విశేషమైన పుజాకార్యక్రమాలతో ఉత్సవాలు మొదలయ్యాయి. ఆలయ ప్రాంగణంలో భక్తులు విష్ణు, లలిత సహస్రనామాల పారాయణం చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో పోటెత్తారు. ఈ ఉత్సవాలను ఈ రోజు నుండి ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్నామని ఆలయ అధికారి లక్ష్మీకుమార్ తెలిపారు.

=====================

గ్రామాలలో పూర్తి స్థాయి మౌలిక వసతులు కల్పించి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఈ రోజు మంత్రి పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 9 నెలల కాలంలోనే గ్రామాలలో పూర్తి స్థాయిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుత వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా గ్రామాలలో బోర్లు వేసి నీటి సరఫరా చేసే పనులు జరుగుతున్నాయని స్పష్టం చేశారు.

=====================
=====================